క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

పిడుగురాళ్ల: పట్టణంలో నేడు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ డీఈఈ బాబ్జినాయక్ తెలిపారు. 132 సబ్ స్టేషన్ నందు మరమ్మత్తుల కారణంగా పిడుగురాళ్ల పట్టణంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని కొండమోడు, మహావీర్ నగర్, బైపాస్ న్యూ ఎస్ఎస్, జానపాడులో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

మాచవరం: పిడుగురాళ్లలోని విద్యుత్ సబ్‌స్టేషన్ నందు అత్యవసర మరమత్తుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ మస్తాన్ తెలిపారు. మండల పరిధిలోని పాత గణేశునిపాడు, మోర్జంపాడు, గోవిందాపురం లిఫ్ట్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

31న కౌన్సిల్ సమావేశం

పిడుగురాళ్ల: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశ మందిరంలో ఈ నెల 31వ తేదీన కౌన్సిల్ సమావేశం నిర్వహించటం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని ఆయన తెలియజేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు

కారెంపూడి: స్థానిక దాచేపల్లి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు సమీపంలో నిర్మాణ దశలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ నిర్మాణానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రూ.15 లక్షలు నిధులు మంజూరు చేశారని వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి శుక్రవారం తెలిపారు. ఎంతో కాలంగా నిధుల కొరతతో ఆగిన నిర్మాణ పనులను ప్రారంభమయ్యేలా చేయూత నిచ్చారని తెలిపారు.

దర్గాలో గార్మిచాంద్ అందజేత



దాచేపల్లి : స్థానిక మాబుసుభానీ దర్గాలో గార్మిచాంద్‌ను శుక్రవారం అందజేశారు. నగర పంచాయతీ వైస్ చైర్మన్ మస్తాన్‌బీ ఖాదర్‌బాషా కుటుంబ సభ్యులు మేళతాళాలతో గార్మిచాంద్‌ను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం దర్గాలో ప్రత్యేక నమాజ్‌లు చేసి గార్మిచాంద్‌ను బహుకరించారు. మాబు సుభానీ దర్గా మహిమ కలిగిన దర్గా అని, ఇక్కడ కోరిన కోర్కెలు తీరుతాయని వైస్ చైర్మన్ మస్తాన్‌బీ చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు డైరెక్టర్లు బుగ్గల జానీ, యర్రంశెట్టి సైదారావు, మాజీ డైరెక్టర్ జానీ, నాయకులు అల్లిసా, నాగులమీరా, పెదబుడే తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



రెంటచింతల: గురజాల మండలం అంబాపురం గ్రామం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గుంటూరు పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న వ్యక్తి శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్లు మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు. రెంటచింతలకు చెందిన చదలవాడ శ్రీనివాసరావు(51) పిడుగురాళ్ల పట్టణంలో బుధవారం రాత్రి జరిగిన ఓ వివాహ కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తుండగా ప్రమాదం సంభవించిన విషయం విదితమే. గురువారం తెల్లవారుజామున శ్రీనివాసరావును కుటుంబ సభ్యులు గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించడం జరిగింది. కాగా మృతునికి భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం



నకరికల్లు: పత్తిలోడుతో వస్తున్న ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. డ్రైవర్ క్షేమంగా బయటపడ్డాడు. రద్దీగా ఉండే రహదారిలో అదృష్టవశాత్తు ఎలాంటి ముప్పు వాటిల్లలేదు. వివరాల్లోకి వెళితే ఫిరంగిపురం నుంచి పత్తిలోడుతో మినీ ఆటో గురజాల వైపుకు బయలుదేరింది. మార్గంమధ్యలో నకరికల్లు మండలం అడ్డరోడ్డు వద్దకు చేరుకునేసరికి ఆటో టైరు పేలిపోయింది. దీంతో ఆటో అదుపు తప్పి రోడ్డుకు అడ్డంగా బోల్తాపడింది. ఆటోలోని పత్తి బోరియాలన్నీ చెల్లాచెదురుగా పడిపోయాయి. ఆటోలో డ్రైవర్ మాత్రమే ఉన్నాడు. అతనికి ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదంతో రోడ్డుకిరువైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఘటనాస్థలానికి చేరుకున్న పెట్రోలింగ్ పోలీస్ సిబ్బంది పత్తి బోరియాలను మరొక వాహనంలోకి మార్పించి ఆటోను పక్కకు తొలగించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

పేదల పాలిట వరం జగనన్న ఆరోగ్య సురక్ష

నియోజకవర్గంలో ముగిసిన జగనన్న ఆరోగ్య సురక్ష



కందుకుంటలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పీఆర్కే (ఫైల్ ఫోటో)

వెల్దుర్తి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మాచర్ల నియోజకవర్గంలో ముగిసింది. మాచర్ల నియోజకవర్గంలోని ఐదు మండలాలలో, మున్సిపాలిటీలో 81 సచివాలయాల పరిధిలో 19 రోజుల పాటు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. గ్రామాలు, పల్లెలు, తండాలలో సైతం ప్రతి ఇంటిని జల్లెడ పట్టి వారి ఆరోగ్య విషయాలను సేకరించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అనారోగ్యానికి గురైన వారికి అన్ని రకాల పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, వలంటీర్లు, పీహెచ్‌సీ సిబ్బంది ఐదు విడతల్లో ప్రతి ఇంటికి వెళ్లి వారికి టోకెన్‌లు అందించి గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను చేపట్టి ఉచితంగా పరీక్షలు చేసి మందులను అందించారు. షుగర్, బీపీ ఉన్న వారికి ప్రతినెలా ఇంటి వద్దనే మందులు అందించేలా చర్యలు చేపట్టారు. చిన్న, పెద్ద రోగం అని తేడా లేకుండా, ప్రజలందరికీ ఉచిత వైద్యం చేయటమే కాకుండా లక్షలు ఖర్చయ్యే వైద్యాన్ని సైతం ఉచితంగా అందించటం సంతోషకరమని పేదలు, వృద్ధులు చెప్పటం గమనార్హం.

విజయవంతంగా జగనన్న ఆరోగ్య సురక్ష

పిడుగురాళ్ల: ప్రజా ఆరోగ్యం జగనన్న ఆరోగ్య సురక్షతోనే సాధ్యమవుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి అన్నారు. పట్టణంలోని 7వ సచివాలయం పరిధిలో 11, 12 వార్డు ప్రజలకు శుక్రవారం బీఆర్‌జీసీ స్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్‌చైర్మన్ కొమ్ము ముక్కంటి హాజరై మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ప్రజలు అనారోగ్యంతో బాధపడకూడదని, అటువంటి వారు ఎవరైనా ఉంటే సర్వే నిర్వహించి వైద్యం అందించటమే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగం పని చేస్తుందని తెలిపారు. ప్రజలకు వైద్య సేవలు అందించటంలో వైద్యులు, వైద్య సిబ్బంది నిరంతరం కష్టపడుతున్నారని పేర్కొన్నారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు కాంట్రగుంట శ్రీనివాసరావు, కుక్కమూడి సుందరరావు, వైద్యులు డాక్టర్ బి.మణికంఠ, నిర్మల్‌కుమార్, షాహీద్ వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మబుజ్జి

గురజాల : ప్రజలను సంపూర్ణ ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మబుజ్జి అన్నారు. మండల పరిధిలోని పులిపాడు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ వైద్యశాలల్లో సరైన వైద్యం అందక ఇబ్బందులు పడేవారని నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్యశాలలను ఆధునీకరించడంతో పాటు అంబులెన్సుల వైద్య సేవలు సైతం మరింతగా విస్తరించేలా చర్యలు చేపట్టిందన్నారు. వైద్య రంగంలో పలు కీలక మార్పులు తీసుకువచ్చి ప్రజలకు వైద్యాన్ని చేరువ చేసిందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా రైల్వే బోర్డు కమిటీ మెంబర్ కొమ్మినేని రవిశంకర్, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, కావూరి అంజిబాబు, పరిమి శ్రీను, గ్రామ సర్పంచ్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



జగనన్న సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మబుజ్జి

ఈ-పంట నమోదుపై అభ్యంతరాలు ఉంటే తెలపండి



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు



ఈకేవైసీ జాబితా వివరాలు వెల్లడిస్తున్న ఏవో పాపకుమారి

మాచవరం: 2023 కు సంబంధించి ఈ-పంట నమోదుపై అభ్యంతరాలు ఉంటే వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకురావాలని ఏడీఏ బి.శ్రీకృష్ణదేవరాయలు తెలియజేశారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో ఈ-క్రాప్ బుకింగ్ జాబితాలను శుక్రవారం ప్రచురించి, గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక తనిఖీ నిమిత్తం రైతుల పేర్లను గ్రామ సభల్లో చదివి వినిపించడం జరిగిందన్నారు. మండలంలో మొత్తం 17,475 ఎకరాల్లో పంట నమోదు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారిణి కె.రావమ్మ, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఈ కేవైసీ జాబితా ప్రచురణ

దాచేపల్లి : ఈ కేవైసీ జాబితాను రైతులు పరిశీలించుకోవాలని ఏవో డి.పాపకుమారి అన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న రైతుభరోసా కేంద్రాల్లో శుక్రవారం ఈ కేవైసీ జాబితాలను ప్రచురించారు. ఈ సందర్భంగా ఏవో పాపకుమారి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 22,730 ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేశారని, 20,622 ఎకరాల్లో ఈ కేవైసీ పూర్తి చేశామని చెప్పారు. ఈ కేవైసీ పూర్తి చేసిన భూములు, రైతుల వివరాలను రైతుభరోసా కేంద్రాల్లో ప్రచురించామని, వీటిపై అభ్యంతరాలు ఉంటే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదుపై సామాజిక తనిఖీలు

పిడుగురాళ్ల: మండలంలోని ఖరీఫ్ 2023 సీజన్‌లో 14,376 ఎకరాల్లో పంటలు సాగు చేయగా వాటిని ఈ క్రాప్‌లో పొందుపరిచామని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎన్.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ క్రాప్‌లో నమోదైన పంటల వివరాల ముసాయిదా జాబితాలను 29వ తేదీ వరకు మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద సామాజిక తనిఖీల కొరకు ప్రదర్శిస్తారని ఆయన తెలిపారు. రైతులు జాబితాలను పరిశీలించుకోవాలని సూచించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఆర్బీకేలలో లిఖిత పూర్వకంగా తెలపాలని పేర్కొన్నారు. ఈ క్రాప్ ఖరీఫ్ 2023 సీజన్ సవరణకు ఇది ఆఖరి అవకాశమని అన్నారు. తుది జాబితా ప్రదర్శన తర్వాత ఎటువంటి మార్పులు ఉండవని వివరించారు.

రీ సర్వే పనులు పరిశీలించిన జేసీ



మాచవరం: జగనన్న భూరక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలో జరుగుతున్న భూముల రీ సర్వే పనులు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండలంలో జరుగుతున్న భూముల రీ సర్వే పనులను శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో మాట్లాడి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీ సర్వేతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రీ సర్వే పనులు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి, పలు అంశాలపై చర్చించారు.

సాకారమవుతున్న దశాబ్దాల కల

- రైల్వే బ్రిడ్జి నిర్మాణంతో తీరనున్న ట్రాఫిక్ సమస్య
- రూ.52.8 కోట్లు నిధులు మంజూరు



జానపాడు రోడ్డులోని రైల్వే గేట్ వద్ద నిరీక్షిస్తున్న వాహనదారులు



ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది



మట్టి నమూనాలను సేకరిస్తున్న దృశ్యం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణం, జానపాడు గ్రామానికి 50 ఏళ్ల నాటి కల ప్రభుత్వాలు మారినా కలగానే మిగిలిపోయింది. నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజా సమస్యలపై గళమెత్తి కేంద్ర ప్రభుత్వం చేత ఒప్పించి మరీ పరిష్కారానికి మార్గసూచిగా నిలిచింది. అదే పిడుగురాళ్ల, జానపాడు గ్రామాల మధ్య రైల్వే బ్రిడ్జి నిర్మాణం. నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు, వాహనదారులు గంటల తరబడి రైల్వే గేటు వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. రోజులో సుమారు 7 గంటలు రైల్వే గేటు వద్ద ప్రజలు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యకు పరిష్కారం దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఎంపీ లావు కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిల కృషితో రైల్వే బ్రిడ్జి మంజూరు అయింది. బ్రిడ్జి మంజూరు కోసం పలుమార్లు సీఎం దృష్టికి తీసుకొని రావటంతోపాటు కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకొని వెళ్లి ఎట్టకేలకు పిడుగురాళ్ల, జానపాడు రైల్వే బ్రిడ్జి 5వ స్థానంలో మంజూరు జాబితాలో చేర్పించారు.

రూ.52.8 కోట్ల నిధులు మంజూరు...

పట్టణంలోని జానపాడు రోడ్డులో ఉన్న రైల్వే గేటు వద్ద రైల్వే బ్రిడ్జి నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.52.8 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇందులో రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి రూ.50.50 కోట్లు, ఎన్‌హెచ్ రోడ్ల నిర్మాణానికి, రోడ్డు క్లియరెన్స్ కోసం రూ.2.30 కోట్లు నిధులను మంజూరు చేసింది. టెండర్లు పూర్తి అయ్యాయి. బ్రిడ్జి నిర్మాణానికి కావాల్సిన తొలగింపు కార్యక్రమం ఇప్పటికే 80 శాతం పూర్తి అయింది. మిగిలిన చెట్ల తొలగింపు, విద్యుత్ స్తంభాలు వంటి పనులు జరుగుతున్నాయి. వీటితోపాటు బ్రిడ్జి నిర్మాణానికి మట్టి నమూనాల సేకరణ కూడా జరుగుతుంది.

బ్రిడ్జి నిర్మాణానికి 18 కానాలు...

ఈ రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి మొత్తం 18 కానాలు నిర్మించనున్నారు. ఇందులో జానపాడు గ్రామం వైపు 10 కానాలు, పిడుగురాళ్ల పట్టణం వైపు 8 కానాలు నిర్మించనున్నారు. ఈ రైల్వే బ్రిడ్జి పిడుగురాళ్ల పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపం వరకు అలాగే జానపాడు గ్రామంలో అర్బన్ పబ్లిక్ హెల్త్ సెంటర్ వరకు జరుగుతుంది. అయితే పిడుగురాళ్ల పట్టణం, జానపాడులో రోడ్డు విస్తరణ పనులు చేయనున్నారు. ఈ రైల్వే బ్రిడ్జి నిర్మాణం 1470 మీటర్ల పొడవు, 22 మీటర్ల వెడల్పుతో జరగనుంది. బ్రిడ్జికి రెండు వైపులా 5.5 మీటర్ల వెడల్పుతో సర్వీస్ రోడ్డును నిర్మించనున్నారు.

రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తాం



ప్రజల ఏళ్ల నాటి సమస్యను పరిష్కరించాం. రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి రూ.52.8 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఆక్రమణలను తొలగించటం జరిగింది. మట్టి నమూనా సేకరణ పనులు జరుగుతున్నాయి. అవ్వగానే మంచి రోజు చూసి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తాం. 18 నెలల్లోనే బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. పిడుగురాళ్ల పట్టణ, జానపాడు గ్రామాల ప్రజల చిరకాల సమస్య పరిష్కారం కాబోతుంది.

కాసు మహేష్‌రెడ్డి,
గురజాల నియోజకవర్గ శాసన సభ్యులు

బంగారుతల్లి పథకాన్ని సక్రమంగా అమలు చేయాలి



పశర్లపాడు ఎంపీయూపీఎస్‌లో బంగారుతల్లి కార్డ్స్ పరిశీలిస్తున్న ఎంఈవో-2 శివనాగేశ్వరరావు

రెంటచింతల: రాష్ట్రంలోని కిశోర బాలికలలో రక్తహీనతను నివారించేందుకు పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ప్రారంభించిన బంగారుతల్లి పథకాన్ని పాఠశాలలో సక్రమంగా అమలుచేయాలని ఎంఈవో-2 వై.శివనాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని పశర్లపాడు గ్రామంలో ఎంపీయూపీఎస్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించి బంగారు తల్లి పథకం కార్డ్స్‌ను పరిశీలించి మాట్లాడారు. కిశోర బాలికలకు రక్తహీనత వలన వచ్చే ఆరోగ్య సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ ఈ బంగారు తల్లి పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. బంగారు తల్లి కార్యక్రమం సక్రమంగా అమలుచేయడంలో భాగంగా పాఠశాలల్లో హెచ్‌ఎంలకు, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ పథకంలో భాగంగా పిల్లలకు ఐరన్ సమృద్ధిగా ఉండే బెల్లంతో చేసిన పదార్థాలు, ఆకుకూరలు ,పాలు, గుడ్డు వంటివి అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం అంకారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

దాచేపల్లి : పిల్లల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని డిపివో ఎంపీ భాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కేసానుపల్లి గ్రామంలో బంగారుతల్లి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి ప్రోగ్రెస్‌ను అందించారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ ఆధ్వర్యంలో బంగారు తల్లి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, విద్యార్థుల విద్యతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని డీపీవో చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శోభారాణి, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు, ఎంపీటీసీ చెట్టిపాగు ఏసుదాసు, హెచ్‌ఎం సీహెచ్ ఏసురత్నం, పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం తదితరులు పాల్గొన్నారు.

త్రోబాల్ జిల్లా జట్టుకు గిరిజన పాఠశాల విద్యార్థి



జిల్లా జట్టుకు ఎంపికైన ఎం.కార్తీక్‌నాయక్‌తో స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ సుభాని

రెంటచింతల: స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతన్న ఎం.కార్తీక్ నాయక్ బాలుర త్రోబాల్ అండర్-14 జిల్లా జట్టుకు ఎంపికైనట్లు స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.మోహన్, వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ సుభాని శుక్రవారం తెలిపారు. దాచేపల్లి మండలం తక్కెళ్లపాడు జెడ్పీ హైస్కూల్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న బాలబాలికల అండర్-14 త్రోబాల్ జిల్లా జట్ల ఎంపిక జరిగిందన్నారు. ఎంపికైన క్రీడాకారులు నవంబర్ నెలలో కర్నూల్ జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన కార్తీక్ నాయక్ రానున్న రాష్ట్రస్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రజట్టుకు ఎంపిక కావాలని స్కూల్ ఉపాధ్యాయులు ఆకాంక్షించి అభినందించారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ఎస్సీ కాలనీలో బోరు బావి ఏర్పాటు



వెల్దుర్తి: మండలంలోని శిరిగిరిపాడు గ్రామంలో ఎస్సీ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు బోరు బావిని ఏర్పాటు చేసినట్లు మండల పరిషత్ అధ్యక్షులు చింతా శివరామయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని ఎస్సీ కాలనీలో బోరు బావిని ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వ విప్ పీఆర్కే ఆదేశాల మేరకు బోరు బావిని ఏర్పాటు చేశామన్నారు. సీఎం జగన్ పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, ఎంపీడీఓ ప్రసాద్, తహసీల్దార్ కోటేశ్వరరావునాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతా ఆదినారాయణ, లింగాల రాఘవాచారి, దిబ్బా సీయోను, దాసు తదితరులు పాల్గొన్నారు.

బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే పోలీసులకు తెలియజేయండి

పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ పీవీ ఆంజనేయులు

పిడుగురాళ్ల: బాలికలపై ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పిడుగురాళ్ల పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలబాలికలకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలికల పట్ల ఎవరు అసభ్యకరంగా ప్రవర్తించినా కఠినమైన చట్టాలు అమలులోకి వచ్చాయని, ఎవరిని ఉపేక్షించమని తెలియజేశారు. సైబర్ నేరాలు ఎలా జరుగుతాయి, ఎలా ఎదుర్కోవాలి, ఎలా తప్పించుకోవాలని విద్యార్థులు అవగహన కలిగి ఉండాలని, ఈ విషయాలను తల్లిదండ్రులు, పెద్దలకు చెప్పి సైబర్ క్రైమ్ బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని అన్నారు. ప్రధానోపాధ్యాయులు లింగాల ధనలక్ష్మి, ఎస్ఐ కోటయ్య, ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు

సీఐ దార్ల జయకుమార్



కొత్తగంగరాజుపల్లెలో తనిఖీలు చేస్తున్న సీఐ దార్ల జయకుమార్, ఎస్ఐ సామెల్ రాజీవ్‌కుమార్

రెంటచింతల: ప్రభుత్వం నిషేధించిన నాటుసారాను కాచిన, విక్రయించిన చట్టపరమైన చర్యలు తీసుకుని కేసు నమోదు చేస్తామని కారెంపూడి సీఐ దార్ల జయకుమార్ హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని కొత్తగంగరాజుపల్లె గ్రామంలో ఎస్ఐ సామెల్ రాజీవ్‌కుమార్, పోలీసు సిబ్బందితో కలిసి నివాసాలు, దొడ్లు, వరిగడ్డి వాములలో, సమీప పొలాలలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ దార్ల జయకుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమాచారం అందించిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. నాటుసారా వలన కుటుంబాలు విచ్ఛిన్నం అవుతాయన్నారు. గ్రామాలలో జూదం ఆడేవారిపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు.

నేడు ప్రసన్నాంజనేయుని ఆలయం మూసివేత

బెల్లంకొండ: చంద్ర గ్రహణం కారణంగా శ్రీ కోళ్లూరు ప్రసన్నాంజనేయుని ఆలయాన్ని శనివారం సాయంత్రం మూసివేస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు బొర్రా వేంకట అనంతాచార్యులు తెలిపారు. శనివారం సాయంత్రం 6 గంటలకు మూసివేయనున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటల తరువాత స్వామివారికి గ్రహణ అభిషేక పూజల అనంతరం తిరిగి ఆలయాన్ని తెరవడం జరుగుతుందన్నారు. కావున భక్తులు శనివారం సాయంత్రం ఆలయంలో పూజా, భజనలు నిలిపివేయడంతో పాటు, నిద్రలు చేయడానికి వచ్చే భక్తులను అనుమతించడం లేదన్నారు.

ట్రాక్టర్ అదుపుతప్పి ఒకరు మృతి

ఈపూరు: ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని ముప్పాళ్ల అద్దంకి బ్రాంచి కెనాల్ వద్ద శుక్రవారం జరిగింది. సేకరించిన వివరాల మేరకు పానుగోటివారిపాలెం గ్రామానికి చెందిన గుంటుపల్లి రామాంజనేయులు (46) తన ట్రాక్టర్‌తో పొగాకు నారు తెచ్చేందుకు వెళ్తుండగా అద్దంకి బ్రాంచి కెనాల్‌పై అదుపు తప్పి కాలువలో పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు.